క్లుప్తంగా

పార్క్ అభివృద్ధికి నిధులు

అమలాపురం టౌన్: స్థానిక వాటర్ వర్క్స్‌కు సమీపంలో ఉన్న చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనం(పార్కు) అభివృద్ధికి రూ.9లక్షలతో త్వరలోనే మరమ్మతు పనులు చేపడుతున్నట్టు 26వ వార్డు కౌన్సిలర్ యండమూరి గంగ తెలిపారు. పార్కులో పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు పాడైపోయినట్టు గుర్తించి, ఈ సమస్యపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించామన్నారు. దీంతో ఆట వస్తువుల మరమ్మతులకు రూ.4 లక్షలు, పార్కులో సౌకర్యాలకు రూ.5 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. టెండర్లకు కూడా పూర్తయ్యాయన్నారు. ఈ వాస్తవాలు తెలుసుకోకుండా టీడీపీ నాయకులు కొందరు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం ఇవ్వడం విడ్డూరంగా ఉందని కౌన్సిలర్ గంగ అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, తోటి కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకుల సహకారంతో 26వ వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు ఆమె వివరించారు.

గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించాలి



మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణికి వినతిపత్రం అందిస్తున్న రవిశంకర్, పాఠకులు

అమలాపురం టౌన్: పట్టణ పరిధిలోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు కల్పించాలని 19వ వార్డు వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిక్కాల రవిశంకర్ ఆధ్వర్యంలో కొందరు పాఠకులు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడులకు సోమవారం వినతిపత్రాలు అందించారు. గతంలో పట్టణంలో నాలుగు గ్రంథాలయాలు ఉండేవని, ఇప్పుడు రెండు మాత్రమే ఉన్నాయని, వాటిలో కూడా లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా లేవని వివరించారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. గ్రంథాలయ పాఠకులు కోలపల్లి శ్రీనివాసరావు, గున్నేపల్లి భీమశంకరం, మట్టపర్తి సురేష్, డి.ధనరాజు, మహ్మద్ రఫీ తదితరులతో కలిసి రవిశంకర్ వినతి పత్రాలు అందజేశారు.

'దిశ' యాప్‌పై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ సుంకర మురళీ మోహన్

ఐ.పోలవరం: ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను వినియోగించుకోవాలని, దీనిపై అవగాహన ఉండాలని దిశ డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. మురమళ్ల జెడ్పీ పాఠశాల ఆవరణలో సోమవారం విద్యార్థినులకు దిశ చట్టం, యాప్ వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ బాలికలపై వేధింపులు, సైబర్ నేరాలు నివారించేందుకు దిశ యాప్‌ను ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, దిశ మహిళా ఎస్సై ఎస్.కనకదుర్గ, ఎస్సై సీహెచ్ రాజేష్, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాతాపూడికి పరామర్శ

యానాం: తిరుమల తిరుపతి దేవస్థానం విశ్రాంత వేదపండితులు తాతాపూడి కృష్ణావధానులను సోమవారం ప్రముఖ పారిశ్రామిక వేత్త, రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీఎన్‌నాయుడు పరామర్శించారు. ఆయన స్వగృహానికి వెళ్లి వృద్ధాప్యంతో ఉన్న కృష్ణావధానుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్ఏఓకు సత్కారం అనంతరం డాక్టర్ జీఎన్‌నాయుడు ఆర్ఏఓ మునిస్వామిని ఆయన చాంబర్‌లో కలిసి దుశ్సాలువాతో ఘనంగా సత్కరించారు.

ఉద్యోగులకు సత్కారం



ఉపాధ్యాయిలను సత్కరిస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి, బదిలీపై వెళ్లిన ఉద్యోగులను హెచ్‌ఎం ఎల్.రాణి ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా వై.సత్యశ్రీ, వేటూరి వెంకటేశ్వరరావు, పి.మంజుల, కె.సీతారామయ్య, ఎ.లక్ష్మీ రమణ, వి.అన్నపూర్ణలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఏర్పాటు

యానాం: స్థానిక ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వర్తక సంఘ అధ్యక్షుడు నల్లా వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా జెమినీ స్టూడియో అధినేత ఎస్.అహ్మద్, ఉపాధ్యక్షుడిగా జె.లోవరాజు, కార్యదర్శిగా పెనుగొండ దుర్గబాబు, ట్రెజరర్‌గా నాగళ్ల మురళీకృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎస్.రహీమ్, మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శాంతించిన గోదావరి

- నీట మునిగిన లంక గ్రామాలు
- అప్రమత్తమైన అధికారులు



కర్రివానిరేవులో లంక గ్రామంలో నీట మునిగిన పొలాలు

ఐ.పోలవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి పొంగి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం, భద్రాచలం వద్ద వరద ఉధృతి క్రమేపీ పెరగడం, తగ్గడంతో అధికారులు అప్రమత్తం అయి హెచ్చరికలకు జారీ చేశారు. గత నాలుగు రోజులుగా వరద నీరు మండలానికి చేరుకుంది. లంక గ్రామాలు నీట మునిగాయి. ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం గోదావరి నిలకడగా ఉంది. వరదలు వల్ల పంటలు నీటమునిగాయి. తీరని నష్టం వాటిల్లుతుందని తీర గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. మురమల్ల రాఘవేంద్రవారధి వద్ద గోదావరి పొంగి ప్రవహిస్తోంది. ఐ.పోలవరం మండలంలో పశువుల్లంక, మురమళ్ల, కేశనకుర్రు, కొమరగిరి, ఎదుర్లంక, పాతయింజరం, తిళ్లకుప్ప, జి.మూలపొలం, గోగుళ్లంక, గుత్తినదీవి గ్రామాల్లోని లంక గ్రామాలు ప్రజలు, మత్స్యకారుల ప్రాంతాలు వరద ఇలా పెరిగితే ముంపుబారిన పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

వరదల, భారీ వర్షాల సీజన్ కావడంతో దానికి అనుగుణంగా తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. దీనితో రైతులు లంకల్లో ఉన్న వ్యవసాయ ఉత్పత్తులను మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే వరద ఉధృత వలన మురమళ్ల రాఘవేంద్రవారధి వద్ద ఉన్న పుష్కరఘాట్‌కు వరద నీరు చేరుకొంది. వృద్ధ గౌతమీ గోదావరి పశువుల్లంక, ఎదుర్లంక, అన్నంపల్లి అక్విడెక్టు వద్ద వరద వలన గోదావరి ఉరకలు వేస్తోంది. మత్స్యకారులు తమ నివాసాలు నీట మునగడంతో పడవలపైనే వంట వార్పు చేసుకొంటున్నారు. గుత్తినదీవి రేవు వద్ద స్థానిక అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి, హెచ్చరికలు జారీ చేశారు.

వరద.. లంక గ్రామాల బెదద..

ముమ్మిడివరం: గోదావరి వరద పొంగి ప్రవహించడంతో లంక గ్రామాల ప్రజల గుండెల్లో గుబులుపుడుతోంది. గత రెండు రోజులుగా సంభవించిన వరదల వల్ల మండలంలోని గౌతమి, వృద్ధ గౌతమి నదీ పాయల మధ్య ఉన్న లంక గ్రామాలు గోదావరి ఆటుపోట్ల మధ్య అల్లాడిపోతున్నాయి. సోమవారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లంక గ్రామాలు ఆందోళన చెందుతున్నాయి. వ్యవసాయ భూములు నీట మునగగా, ఇళ్ల మధ్యకు వరదనీరు చేరింది. వ్యవసాయ ఉత్పత్తులు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పశువుల్లంక, సలాదివారి పాలెం వద్ద శేరిల్లంక గ్రామాల్లో విలువైన వ్యవసాయ భూములు నదీ కోతకు గురవుతున్నాయి. లంకాఫ్ ఠానేల్లంక, గురజాపు లంక గ్రామలలో వరదనీరు చేరింది. ముందస్తు సమాచారంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. నీటి మట్టం నిలకడగా ఉన్నప్పటికి మునిగిన పొలాల నష్టం ఏమేరకు ఉంటుందోనని రైతులు దిగులు చెందుతున్నారు. ఆయా గ్రామలలో కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలు నీటమునిగాయి.గోదావరి వెంబడి ఉన్న పశువులను రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



లంకాఫ్ ఠానేల్లంకలో వరద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయశ్రీ తదితరులు



కొమరగిరి లంకలో ఉండే పశువులను ఏటిగట్టుపై కట్టిన రైతులు

అపర భగీరథా మన్నించు..

కాట్రేనికోన: గోదావరి వాసుల కష్టాలను చూసి మధ్య డెల్టాకు ఆనకట్టను భూములకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడు వర్ధంతి రోజున తీరని నిర్లక్ష్యం ఎదురైంది. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహం ఉంది. సోమవారం ఆయన వర్ధంతి అయినప్పటికీ ఏ ఒక్క అధికారి, ప్రజాప్రధినిధి ఆయన విగ్రహానికి కనీసం పూలమాల వేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు చర్చించుకుంటున్నారు. కనీసం ఇరిగేషన్ శాఖలో ఉన్న అధికారులకైనా గుర్తులేకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన చెందారు.

ముమ్మరంగా ఓటరు సర్వే

ముమ్మిడివరం: ఓటరు సర్వే పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ తెలిపారు. సోమవారం కర్రివానిరేవు పంచాయతీలో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటరు సర్వేను ఆమె పరిశీలించారు. ఓటు డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు, చనిపోయిన ఓట్లు, ఒకే ఇంటి నెంబర్‌పై పదుల సంఖ్యలో ఓట్లు, డోర్ నంబర్లు లేనివి ఇలా అన్ని అంశాలపై పక్కాగా సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల ఒకటో నుంచి ఆగస్టు 21 వరకూ బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, దీనిపై పూర్తి స్థాయిలో సర్వే చేస్తున్నామన్నారు. ఆమె వెంట ఆర్ఐ కోడూరి మన్యం, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూడీపీ పరీక్ష కీ విడుదల

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న యూడీసీ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన పోటీ పరీక్ష కీ ని సోమవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్‌శాఖ విడుదల చేసింది. సంబంధిత కీ ని'రిక్రూట్‌మెంట్.పివై.జిఒవి./రిక్రూట్‌మెంట్/యుడిసి/నోటిఫికేషన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు చూడాలని కోరారు. ప్రశ్నలను ఛాలెంజ్ చేయాలని భావిస్తే డీపీఅండ్ఆర్ ఎగ్జామ్ సెల్ ఇమెయిల్ ఐడీ 'డీపీఏఆర్-ఎగ్జామ్ ఎట్‌ది రేట్ ఆఫ్ పీవై.జీఓవీ.ఇన్‌కు ఈనెల 25లోగా పంపాలని కోరారు. అటువంటి క్లయిమ్స్‌ను స్క్రూటినీ చేసి తుది నిర్ణయాన్ని ప్రకటిస్తారన్నారు. పూర్తి ప్రక్రియ పూర్తయిన తర్వాత ఫలితాలను వెల్లడిస్తారన్నారు.

మాదిగ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

అమలాపురం రూరల్: మాదిగ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, మాదిగలకు ఉపాధి కల్పించాని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరావు కోరారు. నడిపూడిలో బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవన్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ జిల్లా సమావేశానికి రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. సీఎం జగన్ అమలాపురం వస్తున్న నేపథ్యంలో వినతి పత్రం ఇవ్వనున్నట్టు నాగేశ్వరావు తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా ఎస్సీ పేటల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని, కమ్యూటీ హాలులు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు కాప నాగభూషణం, చేట్ల సత్యనారాయణ, తొత్తరమూడి ప్రభాకరరావు, మంద వెంకటేశ్వరరావు, మోకాటి అమ్మిరాజు, ఉందుర్తి సత్యనారాయణ, నేదునూరి రాజకుమార్, నాగేశ్వరావు, రాజబాబు, కృష్ణ, సత్యనారాయణ, చంద్రరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మోసేష్‌ను ఎత్తుకున్న చిన్నాన్న



జస్వంత్ తో తల్లిదండ్రులు రామలక్ష్మి, నాగేంద్రకుమార్

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన అరుణకుమారి, దుర్గా ప్రసాద్‌ల మూడేళ్ల కుమారుడు నెల్లి మోసేష్ వినికిడి లోపంతో బాధపడుతున్నాడు. చిన్నారికి చెవులు వినిపించవు. ఎన్ని ఆసుపత్రులు తిప్పినా లాభం లేకుండాపోయింది. గుంటూరు ఆసుపత్రిలో రెండేళ్ల పాటు తల్లిదండ్రులతో కలసి ఉంటే బిడ్డ మాట్లాడేలా చెవులు వినిపించేలా చేస్తామని వైద్యులు చెబుతున్నారు. నిరుపేదలైన తమని ప్రభుత్వం ఆదుకోవాలని ఆర్థిక సాయం అందించాలని వారు కోరుతున్నారు.

అమలాపురం వస్తున్న సీఎం జగన్‌ను కలుసుకునే అవకాశం కల్పించి, తమ బిడ్డలను కాపాడుకునేందుకు సహకరించాలని కోరుతూ సోమవారం బాలయోగి స్టేడియంలో ఉన్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను కలిసి బిడ్డల ఆరోగ్య పరిస్థితిని వివరించి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

సీఎంను కలిసే అవకాశం కల్పించండి..

తాండవపల్లికి చెందిన రామలక్ష్మి, నాగేంద్రకుమార్‌లకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. పుట్టిన నాటి నుంచి తల నిలబెట్టలేని పరిస్థితి. ఈ చిన్నారిని కాకినాడ నుంచి బెంగళూరు ఆసుపత్రిల వరకూ తీసుకెళ్లారు. వైద్యానికి లక్షల రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తేల్చి చెప్పేశారు. ఇప్పటికే బిడ్డ వైద్యం కోసం అప్పుల పాలయ్యామని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడాలని ఆ తల్లిదండ్రులు మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించాలని మంత్రి విశ్వరూప్ ద్వారా ప్రయత్నం చారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ విద్య

సినీ నటుడు నారాయణమూర్తి



అమలాపురం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సందడి చేస్తున్న సినీ నటుడు నారాయణమూర్తి

అమలాపురం టౌన్: విద్యార్థులు ఎంత గొప్ప చదువులు చదివినా వారికి ఉత్తమ మార్గాలను నిర్దేశించేది క్రమశిక్షణేనని సినీ నటుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. అమలాపురంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలను ఆయన సోమవారం సాయంత్రం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నీతి మాటలు బోధించారు. తన రూపొందించిన విప్లవ సినిమాల్లోని కొన్ని పాటలను సరదాగా పాడి వినిపించారు. డైలాగులు చెప్పారు. తనదైన శైలిలో ఆయన మాట్లాడి విద్యార్థులను అలరించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులతో నారాయణమూర్తి కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏఈవో కరాటం ప్రవీణ్, అధ్యాపకుల, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు మేలు చేసేందుకే జగనన్న సురక్ష

ఎంపీపీ రాయుడు సునీత



పటవలలో వృద్ధురాలికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సామ్యూల్ సాగర్ తదితరులు

తాళ్లరేవు: పలు సాంకేతిక కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైన అర్హులకు మేలు చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని, దీని ద్వారా ప్రజలకు నూరు శాతం సంక్షేమం అందుతుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. సోమవారం పటవల పంచాయతీ సచివాలయం-2 పరిధిలో సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు అధ్యక్షతన తహసీల్దార్ ఎస్.పోతురాజు బృందం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అధికారులే నేరుగా ప్రజల వద్దకే వచ్చి వాటిని అందజేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 757 మందికి ఉచితంగా పలు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ప్రత్యేకాధికారి లక్ష్మీనరసయ్య, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు తణుకు వరలక్ష్మి, నాయకులు రాయుడు గంగాధర్, లక్ష్మణ్, చందు, అప్పారావు, సత్తిబాబు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో దూకిన మహిళను రక్షించిన యువకులు

యానాం: యానాం-ఎదుర్లంక బాలయోగి వారధి పైనుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను సోమవారం స్థానిక యువకులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. మండపేట గ్రామానికి చెందిన మహిళను బీచ్‌ప్రాంతంలో ఉన్న గొర్రెల వీరబాబు, మిగిలిన యువకులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఆమెకు భోజనం పెట్టి, ధైర్యం చెప్పి అనంతరం యానాం పోలీసులకు అప్పగించారు.

వరద పరిస్థితిపై ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సమీక్ష

మామిడికుదురు: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో తీర గ్రామాల్లోని పరిస్థితిని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సోమవారం సమీక్షించింది. ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎస్సై ఎం.లోకేష్‌నాయక్ నేతృత్వంలో బృందం సభ్యులు లైఫ్ జాకెట్లతో పాటు ఇతర సామగ్రి తీసుకుని మామిడికుదురు మండలానికి చేరుకున్నారు. తహసీల్దార్ రియాజ్ హుస్సేన్‌తో వరద పరిస్థితిపై చర్చించారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలతో పాటు పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లో కొంత ప్రాంతం వరదబారిన పడుతుందని రెవెన్యూ అధికారుల బృందం సభ్యులకు వివరించారు. వరద మరింత పెరిగిన పక్షంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భారీ వర్షాలు వరదల నేపథ్యంలో తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- రావులపాలెం-2 గడప గడపకూ..

రావులపాలెం: వైఎస్సార్ సీపీ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వివరించి, సేవల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రతి గడపకు వస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని సచివాలయం-2 పరిధిలో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన మంచి ఇది అని ధైర్యంగా చెప్పడానికి, ప్రజలు తామెదుర్కొంటున్న సమస్యలను చెబితే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇలా ప్రజల ముందుకు వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నను మాత్రమే అన్నారు. ఇలా ప్రజల దగ్గరికి జగనన్న వెళ్లడాన్ని దుష్టచతుష్టయం చూసి సహించలేకపోతోందన్నారు. రోజురోజుకీ జగనన్న ప్రజలకు చేరువవుతుంటే వారు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, విజ్ఞులైన ప్రజలే అవన్నీ గమనించాలని కోరారు. పేద ప్రజల సంక్షేమానికి నడుం బిగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మనందరం మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు సభ్యులు కార్యకర్తలు, అభిమానులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సీఎం రంగసామి చేతుల మీదుగా పట్టాను అందుకుంటున్న యానాం విద్యార్థి అఖిలేంద్ర

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఇందిరాగాంధీ మెడికల్ కళాశాల 2010-2017 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారికి సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పట్టాలను సీఎం రంగసామి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా 626 మంది గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఎంబీబీఎస్ పట్టాలు అందుకున్న వారిలో యానాం నియోజకవర్గ ప్రాంతానికి చెందిన సుమారు 20 మంది విద్యార్థులు ఉన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు 10 శాతం మెడికల్ సీట్ల కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ నాడు తన హయాంలో నెలకొలిప్పిన మెడికల్ కళాశాల నుంచి పేద విద్యార్థులు డాక్టర్లు అవుతున్నారని ఆనంద భాష్పాలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ఆర్ సెల్వం, ఆరోగ్యకార్యదర్శి ఉదయకుమార్, డైరెక్టర్ రాములు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉప్పలగుప్తం: రోడ్డు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడంతో వాసాలతిప్ప గ్రామానికి చెందిన కర్రి సత్తిబాబు అనే మత్స్యకారుడి కాలికి సోమవారం తీవ్రగాయమైంది. చల్లపల్లి గ్రామంలో చెక్కావారి సెంటర్ నుంచి వాసాలతిప్ప గ్రామానికి 1.2 కిలోమీటర్ల మేర నూతన రోడ్డు నిర్మాణం, రిటైనింగ్ గోడ నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ రిటైనింగ్ గోడను నిర్మించి పనులను సగంలో వదిలేవేయడం, వాసాలతిప్ప డ్రెయిన్ ప్రాంతం నుంచి మట్టిని అక్రమంగా తరలించడంతో రోడ్లు ప్రమాదకరంగా మారిందని స్థానికులు తెలిపారు. రోడ్డుపై మట్టి ఎక్కువగా ఉండడంతో సోమవారం కురిసిన వర్షానికి బైక్‌పై ప్రయాణించేవారు పదుల సంఖ్యలో జారీ పడిపోయారని, సత్తిబాబు కాలికి తీవ్రగాయమయ్యిందని గ్రామస్తులు తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షం

అమలాపురం టౌన్: పట్టణంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్ర సుమారు రెండు గంటల సేపు వర్షం జోరుగా కురిసింది. పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీ, కార్మిక నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లు, పరిసరాలు కొన్ని చోట్ల వర్షం నీరు నిలిచిపోవడంతో అసౌకర్యానికి గురయ్యారు.

సీఎం సభపై సమీక్ష



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న సత్య నాగేంద్రమణి, రామలక్ష్మి

అమలాపురం టౌన్: అమలాపురం వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనపై మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిద్వారా మహిళతో సమీక్షించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి అధ్యక్షతన స్థానిక 23వ వార్డులోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో సోమవారం డ్వాక్రా మహిళలతో మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడారు. అమలాపురంలో జరగనున్న సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి సత్యనారాయణ, మెప్మా రిసోర్స్ పర్సన్ పద్మ, టౌన్ లెవెల్ ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక 18, 22వ వార్డుల్లో డ్వాక్రా మహిళల సమావేశం జరిగింది.

సంక్షిప్తంగా..

రోడ్డు నిర్మించాలని వినతి

ఉప్పలగుప్తం: విలసవిల్లి పంచాయతీ పరిధిలోని బాలయోగి వారధికి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. భీమనపల్లి గ్రామ పరిధిలో ఉన్న సూదాపాలెం, మంచెంవారిపాలెం, అమలాపురం మండలం సమనస, సవరప్పాలెం గ్రామాల నుంచి విలసవిల్లి గ్రామం రావడానికి ఈ దారే అందుబాటులో ఉంటుంది. ఆ రోడ్డును పరిశీలించి అభివృద్ధి చేయాలని విలసవిల్ల గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. నూటికుర్తి కృష్ణమూర్తి, సుజాత, బి.శ్రీనుబాబు, డి.ధనలక్ష్మి, పలివెల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గోదావరి వరదతో నిలిచిన బోట్లు

యానాం: గౌతమీ గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో మూడు రోజులుగా యానాంలో చేపల వేట బోట్లు, మెకనైజ్డ్ బోట్లు, తెప్పలు నిలిచిపోయాయి. స్థానిక టైడల్‌లాకు సమీపంలో ముందస్తుగా అధిక సంఖ్యలో బోట్లను నిలిపివేశారు. అంతేకాకుండా టూరిజమ్ శాఖకు చెందిన బోట్లను సైతం అక్కడే నిలిపిఉంచారు. అదేవిధంగా రాజీవ్ రివర్‌బీచ్ ప్రాంతంలో బోట్‌హౌస్ వరదనీటికి ముంపుకు గురైంది. పుష్కరఘాట్ వద్ద సైతం వరదనీరు భారీగా చేరుకుంది.

పంచాయతీ పేరు మార్చాలని వినతి

అల్లవరం: ఎస్.పల్లిపాలెం గ్రామ పంచాయతీ పేరుని మార్పు చేయాలని కోరుతూ సర్పంచ్ కొల్లు వెంకటరమణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. 1998లో సామంతకుర్రు నుంచి విడదీసి ఎస్.పల్లిపాలెం పంచాయతీగా అమలులోకి వచ్చింది. అయితే ఎస్.పల్లిపాలెం ఒక సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఉందని, దీనిపై గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో పంచాయతీ పేరుని సామంతకుర్రు-1గా మార్పు చేయాలని అగ్నికులక్షత్రియ అధ్యక్షుడు పెమ్మాడి సాయి, కొపనాతి వెంకటరాజు, కొప్పాడి నాగేశ్వరరావు, కొల్లు నాగేశ్వరరావు, పచ్చిమాల లీలాప్రసాద్ తదితరులు జిల్లా కలెక్టర్‌ని కోరారు.

పొగాకు నియంత్రణపై అవగాహన

అమలాపురం రూరల్: ఈదరపల్లిలోని రవితేజ జూనియర్, డిగ్రీ కళాశాలలో సోమవారం పొగాకు నియంత్రణ, మత్తు పదార్థాల విమోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. పొగాకు, మద్యం, గంజాయి, వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఏవీకే నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ కె.దొరబాబు, అధ్యాపకులు పి.శ్రీనివాసరావు, జె.ప్రసాద్, కేవీ బాలకుమార్, డీఎంహెచ్‌పీ సైకియాట్రిస్ట్ సోషల్ వర్కర్ సీహెచ్ బాబి, డీ అడిక్షన్ సెంటర్ కౌన్సిలర్ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం జాబితా విడుదల

యానాం: సముద్రంలో ఓఎన్‌జీసీ సంస్థ గ్యాస్‌పైపులైను వేస్తున్న నేపథ్యంలో నష్టపోతున్న మత్స్యకారులకు ఇచ్చే నష్టపరిహారం జాబితా విడుదలయ్యిందని, దానిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 10 రోజుల్లో తెలపాలని సోమవారం యానాం మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 2022-23 సంవత్సరానికిగాను లబ్ధిదారుల జాబితా సర్వేకు సంబంధించి పుదుచ్చేరి ప్రభుత్వం విలేజ్ లెవిల్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ అన్ని గ్రామాల్లోను పర్యటించి సర్వే చేసి 1150 మంది అర్హులను గుర్తించి జాబితాను ప్రతి మత్స్యకార గ్రామ కమ్యూనిటీహాలు, మత్స్యశాఖ ఆఫీసులో ఉంచినట్లు తెలిపారు. అభ్యంతరాలను రాతపూర్వకంగా ఆగస్టు 2లోగా తెలపాలని కోరారు.

పశువులకు టీకాలు

అమలాపురం రూరల్: సవరప్పాలెం గ్రామంలో సోమవారం పశువులకు టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయారెడ్డి గ్రామంలో పర్యటించి పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. గొంతు వాపు వ్యాధి వచ్చిన పశువులకు ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండి మేత తినలేకపోవడం, నోటి నుంచి చొంగ కారడం వంటి కనిపిస్తే వైద్యులకు చూపించాలన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, సవరప్పాలెం పశు వైద్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

అల్లవరం: బోడసకుర్రు టిడ్కో భవనాల్లో నివాసం ఉంటున్న వారు ఏలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని అల్లవరం ఎస్సై శ్రీనునాయక్ తెలిపారు. టిడ్కో గృహాల సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ టిడ్కో భవనాల్లో నివాసం ఉంటున్న వారందరూ కులాలకు, మతాలకు అతీతంగా ఐకమత్యంగా మెలగాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఎదురైతే పోలీసుల సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ఎస్సై శ్రీనునాయక్ తెలిపారు. టిడ్కో భవనాల ఇన్‌చార్జి డాక్టర్ లలిత, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారులకు సత్కారం

కాట్రేనికోన: స్థానిక మండల విద్యాశాఖాధికారులుగా బాధ్యతలు స్వీకరించిన కేటీవీవీ సుబ్రహ్మణ్యం(ఎంఈఓ-1), వెంకటరమణ(ఎంఈఓ-2)లకు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇరువురిని గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారులు, క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షుడు అంజి ఆకొండి, ప్రముఖులు ఆకొండి మహేష్‌శర్మ తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకుని జ్ఞాపికతతో సత్కరించారు.